ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

చిత్తూరు జిల్లా వార్తలు 5

ఆదివారం 15 సెప్టెంబరు 2024







బ్రహ్మరథంలో బొజ్జ గణపయ్య

● కిక్కిరిసిపోయిన కాణిపాక వీధులు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 14 : కాణిపాక ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.కాకర్లవారిపల్లెకు చెందిన ఎతిరాజులు నాయుడు,శివప్రసాద్ జ్ఞాపకార్థం మీనాకుమారి, కాణిపాకానికి చెందిన మాజీ వీఎం పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ వీఎం చంద్రశేఖర రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరిప్రసాదరెడ్డి ఉభయ దారులుగా వ్యవహరించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు, దేవతామూర్తుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి.రథోత్సవ సమయంలో ఆలయ సిబ్బంది ధరించిన సైనికుల వేషధారణలు, కీలు గుర్రాలు కూడా అలరించాయి.ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని బ్రహ్మరథంపై ఆశీనులను కావించారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య సంప్రదాయ బద్ధంగా రథాన్ని భక్తులు, ఉభయదారులు కొంతదూరం లాగి భక్తుల దర్శనార్థం ఉంచారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బ్రహ్మరథంపై ఉప్పు, బొరుగులు, మిరియాలు, చిల్లర నాణేలు చల్లి, కొబ్బరికాయలు సమర్పించి, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో రథాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి పాల్గొన్నారు.



కాణిపాకంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం భిక్షాండి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తిరుకల్యాణం నిర్వహణకు కాణిపాకం, తిరువణంపల్లెకు చెందిన వణిగ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు. రాత్రి నిర్వహించే అశ్వవాహన సేవకు 44బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె,కారకాంపల్లెలకు చెందిన గోనగుంట బలిజ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు.





కుమ్మరగుంట పొలాల్లో అట్లాస్ మోత్

పుంగనూరు

బంగారువర్ణంలో వున్న ఈ సీతాకోక చిలుక శనివారం పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ కుమ్మరగుంట పొలాల్లో కనిపించింది. కుమ్మరగుంటకు చెందిన మనోహర్ ఉల్లి సాగు చేసిన పొలంలో కన్పించిన ఈ సీతాకోక చిలుక సైజును చూసినవారు ఆశ్చర్యపోయారు.అట్లాస్ మోత్‌గా పిలిచే ఈ సీతాకోక చిలుక ఒక్కోవైపు రెండు రెక్కలతో పెద్ద పురుగులా కనిపించింది.రైతులు దాన్ని పట్టుకోబోగా మామూలు పురుగువలే రెక్కలు ముడుచుకోవడం, మళ్లీ కొద్దిసేపటికి సీతాకోక చిలుక వలే రెక్కలు విచ్చుకోవడం జరిగింది.దక్షిణ భారతదేశంలో ఎక్కువగా ఇది కన్పిస్తుంటుందని తిరుపతికి చెందిన పరిశోధకుడు భూఫేష్ గుప్తా తెలిపారు.



రుయా తీరు మారదా?

వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని ఆయన కుమారులే భుజాలపై మోస్తూ వైద్య పరీక్షలకు తీసుకెళుతున్న ఈ దృశ్యం శనివారం తిరుపతి రుయాస్పత్రిలో కనిపించింది.పేదల ఆస్పత్రిగా పేరుబడ్డ ఈ ఆస్పత్రిలో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణమై పోయాయంటే వైద్య సిబ్బంది సేవలపై అధికారుల పర్యవేక్షణ ఏస్థాయిలో వుందో తెలుస్తుంది.

- తిరుపతి(వైద్యం)

రెండు నెలలుగా అందని రేషన్

● గగ్గోలు పెడుతున్న 740మంది కార్డుదారులు

● బియ్యాన్ని దిగమింగిన ఎండీయూ ఆపరేటర్



మూతపడిన పుంగనూరు ఈస్టుపేట రేషన్‌షాపు



పుంగనూరు ఏటిగడ్డపాళ్యంలో రేషన్ ఇవ్వలేదని ఆగ్రహం వక్తం చేస్తున్న కార్డుదారులు

కడుపుకొడుతున్నారు



మా ఇంట్లో ఐదుగురు వున్నాం. రేషన్ బియ్యంపై ఆధారపడి జీవిస్తున్నాం.అయితే మా ఏటిగడ్డపాళ్యంలో ఎప్పుడూ బియ్యం సరిగా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.మాకు అందాల్సిన బియ్యం ఎవరో తినేసి మా కడుపుకొట్టడం న్యాయమా?

- ఆఫియా

పుంగనూరు, సెప్టెంబరు 14: పుంగనూరులో పేదలకు అందాల్సిన రేషన్ సరుకులను ఎండీయూ ఆపరేటర్, డీలర్లు స్వాహా చేసేశారు. రెండు నెలలుగా బియ్యం ఇవ్వకపోవడంపై రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కార్డుదారులంతా వాపోతున్నారు. పుంగనూరు ఈస్టుపేటలోని రేషన్‌షాపు 1082018ను డీలర్ ఎం.జాఫర్ నిర్వహిస్తున్నారు. ఈ రేషన్‌షాపు పరిధిలో ఏటిగడ్డపాళ్యం, ఉబేదుల్లా కాంపౌండ్, పోలీస్‌లేన్ తదితర ప్రాంతాలకు చెందిన 740 రేషన్‌కార్డులున్నాయి. గతంలో స్టోర్ పోలీస్‌లైన్‌లో ఉండగా కొంతకాలం క్రితం ఈస్టుపేటకు మార్చారు. కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం, చక్కెర, గోధుమపిండి, రాగులను రేషన్ షాపునుంచి ఎండీయూ వాహనం ద్వారా ఇళ్లవద్దకు తీసుకొచ్చి ఇవ్వాల్సిఉంది. ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం ఇవ్వకుండా ఎగ్గొట్టడంపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.ఈ నెలకు సంబంధించి 14వ తేది నాటికి కూడా నిత్యావసర వస్తువులు ఇవ్వలేదు.రెండు నెలలుగా రేషన్ తీసుకోకపోతే కార్డులు రద్దు అవుతాయోమోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండీయూ వాహన ఆపరేటర్ రేషన్ బియ్యంతో పాటు గోదుమపిండిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కలెక్టర్ విచారించాలి



మా స్టోర్‌లో 2 నెలలుగా మాకే కాదు కార్డులున్న వారికి ఎవరికీ బియ్యం ఇవ్వలేదు.ప్రభుత్వం పంపిన బియ్యం ఏమయ్యాయి? కలెక్టర్ విచారణ జరిపించాలి.ఎండీయూ ఆపరేటర్‌ను, డీలర్‌ను తొలగించి సరుకులు సక్రమంగా ఇప్పించేలా చూడాలి.

- ముస్తఫా

అదుపు తప్పి కారు బోల్తా

● ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు



ఫ్లై ఓవర్ వద్ద బోల్తాపడిన కారు





మృతులు గంగరాజయ్య, లక్ష్మి



గాయపడిన ఉష

బంగారుపాళ్యం, సెప్టెంబరు 14: అదుపు తప్పి కారు బోల్తా పడటంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా,ఐదుగురికి తీవ్రగాయాలయ్యా యి. ఈ దుర్ఘటన చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె సమీపంలో ఉన్న ఫ్లైఓవర్‌పై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గృహప్రవేశం ఉండటంతో కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబల్లాపూర్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు తమిళనాడులోని కంచిలో దుస్తులను కొనుగోలు చేయడానికి శనివారం వేకువజామున కారులో బయల్దేరారు. ఉదయం ఏడు గంటల సమయంలో మార్గమధ్యంలోని కొత్తపల్లె ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి కారు అదుపుతప్పి పక్కనున్న రక్షణ గోడను వేగంగా ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంగరాజయ్య(56), లక్ష్మి (35) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వాహనంలోని సుచిత్ర, ధరణి, శ్రీనివాస మూర్తి, తనూజ, ఉష తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం కోలార్ మెడికల్ కాలేజ్‌కు ప్రైవేటు అంబులెన్స్ ద్వారా తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి తెలిపారు.









క్షతగాత్రులు సుచిత్ర, తనూజ, ధరణి, శ్రీనివాసమూర్తి

క్షణికావేశాలను వదిలిపెట్టాలి :డీజే భీమారావు



చిత్తూరు లీగల్, సెప్టెంబరు 14: గ్రామీణ ప్రాంత ప్రజలు క్షణికావేశాన్ని పక్కనపెట్టి ఐకమత్యంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు కోరారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలు ఐకమత్యంగా ఉంటే స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు.న్యాయమూర్తులు వెన్నెల, 1వ అదనపు జిల్లా జడ్జి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

3,367 కేసులు పరిష్కారం : శనివారం జరిగిన లోక్ అదాలత్ ద్వారా 3,367 కేసులు పరిష్కారమయ్యాయని డీజే తెలిపారు.వాయల్పాడులో 76, తిరుపతిలో 656, తంబళ్లపల్లెలో 69, శ్రీకాళహస్తిలో 644, సత్యవేడులో 248, పుత్తూరులో 419, పుంగనూరులో 51, పీలేరులో 48, పలమనేరులో 140, పాకాలలో 156, నగరిలో 134, మదనపల్లెలో 17, కుప్పంలో 173, చిత్తూరులో 636 కేసులు ఉన్నాయి.

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల విరాళం రూ.32.49 లక్షలు


సీఎంకు చెక్ అందజేస్తున్న ఎస్జీబీ చైర్మన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకు (ఎస్జీబీ) ఉద్యోగులు తమ వేతనం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళమిచ్చారు. రూ.32.49 లక్షల మెగాచెక్‌ను బ్యాంకు చైర్మన్ ఏ.ఎస్.ఎన్.ప్రసాద్ విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు.ఈసందర్భంగా బ్యాంకుఉద్యోగుల ఔదార్యాన్ని సీఎం అభినందించారు.

ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ


సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీధర్‌వర్మ

ఐరాల, సెప్టెంబరు 14: ఓసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దాట్ల శ్రీధర్‌వర్మ ఎన్నికైనట్లు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చిత్తూరు బ్యాన్స్ హోటల్‌లో రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డిని, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.పండుదొర, పరిపాలన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా వి.సురేష్‌కుమార్, కోఆర్డినేషన్‌గా వి.మురళీకృష్ణ, అనంతరం వివిధ కమిటీలను ఎన్నుకున్నట్లు వివరించారు. శ్రీధర్ వర్మ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఓసీ విద్యుత్ ఉద్యోగుల సమస్యపై పోరాడతానన్నారు. ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.1.08 లక్షల విరాళం



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 14: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లెకు చెందిన లెక్కలపూడి సాంబశివనాయుడు శనివారం రాత్రి రూ.1,08,000లను చెక్ ద్వారా విరాళంగా అందించారు. దాతకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మొగిలి ఘాట్‌లో ఉన్నత స్థాయి రవాణా సంస్థ ప్రతినిధుల బృందం - ప్రమాద స్థలంలో విరిగి వంగి పోయిన బారికేడ్లు

మొగిలి ఘాట్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు

ప్రమాదకర మలుపులు ఉండడమే కారణమన్న బృందం

పలమనేరు, సెప్టెంబరు 14 : బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఈనెల 13వ తేది జరిగిన రోడ్డు ప్రమాద ఘటనను శనివారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేసింది. ఈ బృందం మొగిలిఘాట్ చేరుకొని ఘటనా స్థలంతోపాటు ప్రమాదకర మలుపులను పరిశీలించింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఘాట్‌లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉండడమే ఈ ప్రమాదానికి కారణమన్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం లేదా నిద్రలేమి, లేదా లారీని న్యూట్రల్ చేసి కంట్రోల్ చేయలేకపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. ఘాట్‌రోడ్డుపై మలుపుల వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు కూడా సున్నితంగా ఉన్నాయన్నారు. అంతేకాక ఘాట్‌లో ఎక్కడా స్పీడ్ లిమిట్‌ను తెలియజేసే హెచ్చరిక బోర్డులను కూడా జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేయలేదన్నారు. అందువల్లే డ్రైవర్లు అవగాహనారాహిత్యంతో అపరిమిత వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి అవుతున్నారన్నారు. ఈ బృందంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈడీ ఆపరేషన్ అధికారి చంద్రశేఖర్, డిప్యూటీ సీటీఎం శ్రీనివాసరావు, ప్రమాదాల కారణాలను గుర్తించే నిపుణలు ఎం. బాలాజి ఉన్నారు. నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని వారు తెలిపారు.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

● ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేసిన డీఆర్వో


మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చెక్ అందజేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు మృతదేహాలకు శనివారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబీకులకు అప్పగించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేర కు కలెక్టర్ సుమిత్‌కుమార్.. డీఆర్వో పుల్లయ్య ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను సంబంధించిన చెక్‌కు వారి కుటుంబీకులకు అప్పగించారు. అలాగే తీవ్రంగా గాయపడిన పద్మావతికి వైద్య ఖర్చుల కోసం రూ.20వేలను కలెక్టర్ మంజూరు చేశారు. ఆర్టీసీ తరఫున గాయపడిన 22మందికి గాయాల తీవ్రతను బట్టి రూ.3వేల నుంచి రూ.10వేల వరకు వైద్య ఖర్చుల కోసం అందించినట్లు ఆర్ఎం రాము తెలిపారు. తీవ్రగాయాలతో సీఎంసీలో చికిత్స పొందుతున్న పద్మావతికి ఆర్టీసీ తరఫున రూ.50వేలను అందించారన్నారు. స్విమ్స్‌లో చికిత్స పొంతున్న అషతోష్ భార్య, బిడ్డకు అయ్యే వైద్య ఖర్చులను ఆర్టీసీ భరించనున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబీకులకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చే విషయాన్ని ఆర్టీసీ తరఫున ఇంకా నిర్ణయించలేదని పేర్కొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



పాతపేట సమీపంలో ఏనుగులు దాడిలో ధ్వంసమైన వరి - రాంపల్లె బీట్‌లో ధ్వంసమైన మామిడి చెట్లు

కల్లూరు, సెప్టెంబర్ 14: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మూడు రోజులక్రితం పాతపాళ్యం అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు పాతపేట సమీపానికి చేరుకొని పంటలను ధ్వంసం చేయడం ప్రారంభించాయి. శుక్రవారం రాత్రి పాతపేటలోని రైతు శంకరకు చెందిన టమోటా, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఇదే గ్రామంలోని రైతులు మునిరాజ, జయమ్మకు చెందిన వరి, వేరుశనగ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. కల్లూరు సమీపంలోని ముచ్చుగుట్ట నుంచి ఎద్దలవారిపల్లి సమీపం వరకు ఏనుగుల గుంపు నడిచినట్లు పాదముద్రలు కనిపించాయి.

సోమల : సోమల మండలంలో ఏనుగులు సంచరిస్తూ రైతుకు కునుకు లేకుండా చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఆవులపల్లె పంచాయతీ రాంపల్లె బీట్ సమీపంలోని మామిడి, వరి, వేరుశనగ పొలాల్లో తిరగాడి పంటల నష్టపరిచినట్లు రైతులు తెలిపారు. పదిరోజులుగా చిన్నఉప్పరపల్లె పంచాయతీ చెరువు కోనలో మకాం వేసిన ఏనుగులు మళ్లీ పత్రపల్లె, కొత్తూరు వైపు వచ్చాయన్నారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐదేళ్ల తర్వాత శ్రీవారి దర్శనం

పంతం వీడిన టీడీపీ నేత నరసింహయాదవ్


ఆలయం ముందు నరసింహయాదవ్ దంపతులు

తిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ ఐదేళ్ల తర్వాత కుటుంబ సమేతంగా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వైసీపీ పరిపాలనను నిరసిస్తూ గత ఐదేళ్లుగా (పార్టీ అధినేత చంద్రబాబు దర్శనానికి వచ్చినప్పుడు మినహా) ఆయన శ్రీవారిని దర్శించుకోలేదు. వైసీపీ పాలనలో అన్యాయాలు, అక్రమాలకు నిరసనగా ఆయన దీక్ష పూనారు. ప్రభుత్వం మారిన తర్వాత శనివారం తన 40వ పెళ్లిరోజు సందర్భంగా ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దీక్షను శనివారంతో విరమించుకున్నట్లు నరసింహయాదవ్ తెలిపారు.

21.8కేజీల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: 21.8కేజీల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం నిఘా పెట్టింది. ముగ్గురు యువకులతో సహా కారును, 21.8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనివెనుక మూలాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త జడ్పీ సీఈవో వచ్చాకే బదిలీలు

● పెండింగ్‌లో ఎంపీడీవోల లిస్ట్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: జిల్లాలో వివిధ శాఖల్లో బదిలీల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. జడ్పీలో ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాల కోసం ఎంపీ, ఎమ్మెల్యేల లేఖలు సమర్పించారు. గత నెల 31వ తేదిన బదిలీల ప్రక్రియ పూర్తి చేసి సెప్టెంబరు 1వ తేదికి వారు బదిలీ అయిన చోట్లలో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు ఉండకూడదని ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు బదిలీల గడువును పొడిగించింది. తిరిగి విజయవాడ వరదలు కారణంగా ఆ గడువును సెప్టెంబరు 22 వరకు పొడిగించింది. ఇంతలో జడ్పీ సీఈవో బదిలీ కావడంతో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త సీఈవో వచ్చాకే బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

సమర్థులైన ఎంపీడీవోలకోసం ఎమ్మెల్యేల వెతుకులాట

తమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చక్కబెట్టేందుకు సమర్థులైన ఎంపీడీవోల కోసం ఎమ్మెల్యేలు వెతుకులాట మొదలు పెట్టారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 మండలాలుంటే 48 మండలాలకే రెగ్యులర్ ఎంపీడీవోలున్నారు. మిగిలిన 17 మండలాలకు ఈవోఆర్డీలు, ఏవోలు ఇంచార్జ్ ఎంపీడీవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 48మంది రెగ్యులర్ ఎంపీడీవోల్లో ఒక్కరు మాత్రమే ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు.48మందిలో సొంత జిల్లాలకు బదిలీ కావాలని 13 మంది ఎంపీడీవోలు దరఖాస్తు పెట్టుకుంటే వాటిని పీఆర్ కమిషనర్ ఆమోదించారు. దీంతో 35మంది ఎంపీడీవోలు మాత్రమే జిల్లాలో మిగిలారు. దీంతో కొన్ని మండలాలకు తిరిగి ఈవోఆర్డీ, ఏవోలను ఇన్‌చార్జ్‌లుగా నియమించనున్నారు. ఈ కారణంగా ఎంపీడీవోల కొరత ఏర్పడడంతో పాటు బదిలీలు కూడా ఆలస్యమవుతున్నాయి.

కుప్పంలో ఒక్కరే విధుల్లోకి : కుప్పం సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో కలెక్టర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పనిచేసేందుకు సమర్థవంతులైన ఎంపీడీవోలను ఏరికోరి వేశారు. ఇందులో కుప్పం మండలానికి బీఎన్ కండ్రిగ ఎంపీడీవో సాయి లహరిని నియమించారు.శాంతిపురానికి వెదురుకుప్పం ఎంపీడీవోగా పనిచేసిన ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను నియమించారు. రామకుప్పం మండలానికి ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్యను, గుడుపల్లి ఎంపీడీవోగా తాజ్‌మజూరూర్‌ను నియమించారు. ఈయన ఎన్నికల బదిలీల్లో బాగంగా వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి ఈయన్నే గుడుపల్లి ఎంపీడీవోగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కుప్పం మండలం ఎంపీడీవో సాయి లహరి తప్ప మరెవరూ విధుల్లో చేరలేదు. వివిధ కారణాలు చూపించి తమకు వేరే స్థానాలు కావాలని కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జడ్పీ సీఈవో పోస్టుకు తీవ్ర పోటీ

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఆ సీటుకోసం టీడీపీ ముఖ్యనాయకుల ద్వారా ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నిన్నటి వరకు రవికుమార్ నాయుడు, ఆదిశేషారెడ్డి పేర్లు విన్పిస్తుండగా తాజాగా వెంకటరత్నం పేరు తెరపైకి వచ్చింది. తిరుపతి జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న ఎం. రవికుమార్ నాయుడికి గతంలో జడ్పీసీఈవోగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకే ఈ పోస్టు ఖరారవుతుందని ప్రచారం జరిగింది.ప్రస్తుత జడ్పీ డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి కూడా సీఈవో పోస్టుపై కన్నేశారు. తనకు తెలిసిన టీడీపీ వర్గాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయనకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య తక్కువే.గతంలో ఇక్కడ జడ్పీ ఏవోగా పనిచేసిన వెంకటరత్నం పేరు రెండ్రోజులుగా బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన అనంతపురం జిల్లా తాడిపత్రి డ్వామా ఏపీడీగా విధులు నిర్వహిస్తున్నారు.కలెక్టర్‌గా హరినారాయణన్ ఉన్నప్పుడు హౌసింగ్ శాఖలో పురోగతి లేదంటూ వెంకటరత్నంతో పాటు చాలామంది ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీచేస్తూ జీతాలను నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దాంతో వెంకటరత్నం దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.తర్వాత పదోన్నతిపై తాడిపత్రి వెళ్ళారు.ఆయనకు జనసేన పెద్దల ఆశీస్సులు మెండుగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాతృశాఖ రెవిన్యూకు బదిలీ అయిన జడ్పీ సీఈవో గ్లోరియా 18న రిలీవ్ కానున్నారు.ఆమె స్థానంలో ఇన్‌చార్జి సీఈవోగా డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.బదిలీలకు ఈనెల 22వ తేదివరకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

డ్వామా పీడీగా గంగాభవాని?

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 : డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న గంగాభవాని పీడీగా ప్రమోట్ కానున్నారు.మొన్నటిదాకా పీడీగా వ్యవహరించిన రాజశేఖర్‌ను ప్రభుత్వం మాతృశాఖ రెవిన్యూకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో రెండేళ్ళ క్రితం అప్పటి పీడీ చంద్రశేఖర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీడీగా గంగాభవానీ చేరి రెండేళ్ళు పనిచేశారు. ఎన్నికల సమయంలో ఆమె స్థానంలో ప్రభుత్వం రాజశేఖర్‌ను నియమించింది. ఇదిలా వుండగా డీఆర్డీఏ పీడీ పోస్టు కోసం ముగ్గురు పోటీపడుతున్నారు. డీఎంకే తులసి ప్రస్తుతం డీఆర్డీఏ పీడీగా ఉండగా, వైసీపీ మద్దతుదారురాలు అనే ముద్ర పడడంతో పాటు చాలాకాలంగా పనిచేస్తుండడంతో ఆమెకు స్థానచలనం అనివార్యమైంది.

నగరిలో వైసీపీ పట్టు కోల్పోతోందా?

నగరి, సెప్టెంబరు 14: నగరి నియోజకవర్గంలో రోజురోజుకూ వైసీపీ పట్టు కోల్పోతున్నట్లు కనిపిస్తోంది.పార్టీ సీనియర్ నేతలు,నగరి మున్సిపల్ మాజీ చైర్మన్లు కేజే కుమార్, కేజే శాంతిలను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భరత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేజే కుమార్ కుటుంబం తనకు వ్యతిరేకంగా పనిచేసిందని మాజీ మంత్రి రోజా చేసిన ఫిర్యాదుతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే బలమైన నేతలుగా పేర్కొనే విజయపురం మండల నాయకుడు లక్ష్మీపతి రాజు,నింద్ర మండలంలో శ్రీశైలం ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు భాస్కర్‌రెడ్డి, పుత్తూరులో మొదలియార్ వర్గానికిచెందిన ఏలుమలై (అమ్ములు), వడమాలపేట మండలానికి చెందిన జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఎన్నికల ముందే టీడీపీలో చేరిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరి కొందరు వైసీపీ నాయకులు టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం.ఈ పరిణామాల పట్ల వైసీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారం కూడా లేని సమయంలో ఇలా బలమైన నేతలను సస్పెండ్ చేసుకుంటూ పోతే పార్టీ మరింత బలహీనపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కిట్ కళాశాలకు మంచిరోజులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 14: స్థానిక స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిరోజులు రానున్నాయి. మూడేళ్లుగా మూతబడ్డ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018 అక్టోబరు 26న స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అప్పగించేలా అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం స్కిట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి, 2021 డిసెంబరు నుంచి తరగతులను నిలిపివేసింది. స్కిట్ కళాశాలకు పూర్వవైభవం తెస్తానని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించాయి. మూడేళ్ల తర్వాత కళాశాలపై కదలిక రావడం పట్ల శ్రీకాళహస్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకే సర్వాధికారాలు

ఇద్దరు ఎంఈవోల స్థానంలో ఒక్కరే?


చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 14: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థల్లో మార్పులు, సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సర్వాధికారాలు కట్టబెట్టేందుకు యత్నిస్తోంది. గత ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోలను తీసుకురావడంతో ఏర్పడిన గందరగోళానికి స్వస్తి పలకనుంది.

స్కూల్ కాంప్లెక్స్ సంఖ్య కుదింపు

జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న 250 స్కూల్ కాంప్లెక్స్ సంఖ్యను 170కి కుదించనుంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు పూర్తిచేశారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోకి కనీసం 35 మంది సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)లు ఉండేలా కేడర్ స్ట్రెంత్ ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

హెచ్‌ఎంలకు అధికారాలు

ప్రస్తుతం ఎంఈవోలకు ఉన్న ఎస్జీటీలకు సంబంధించి సర్వీసు అంశాలు, సెలవులు మంజూరు తదితర ఎగ్జిక్యూటివ్ అధికారాలన్నీ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఇవ్వనున్నారు. మండల స్థాయిలోని ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను సవరించి గతంలోవలె ఒక్క ఎంఈవోనే ఉండేలా మార్పులు రానున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంఈవో-2లను తొలగించడంతోపాటు, ఎంఈవో-1ని కేవలం పాఠశాల తనిఖీ అధికారిగా పరిమితం చేయనున్నారు. దీంతో ఎంఈవో-2లు ఇక పంచాయతీ రాజ్ పాఠశాల హెచ్‌ఎంలకే పరిమితం కానున్నారు.

'ఫెవికాల్' ఉద్యోగులకు బదిలీలుండేనా..?

- వైసీపీతో అంటకాగుతూ దీర్ఘకాలం కొనసాగింపు
- మళ్లీ కొనసాగేందుకు కొందరు ముమ్మర ప్రయత్నాలు
- 22 వరకు బదిలీలకు గడువు పెంపు

పుంగనూరు, సెప్టెంబరు 14: పుంగనూరులో దీర్ఘకాలంగా కుర్చీలకు ఫెవికాల్ అంటించుకుని అతుక్కుపోయి వైసీపీతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులకు కూటమి ప్రభుత్వంలోనైనా బదిలీలుంటాయా అనే అనుమానాలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో గత 15 ఏళ్ల ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పదేళ్ల రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇంత కాలం వీరికి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు, ఉద్యోగులు పుంగనూరును వదలకుండా ఉంటున్నారు. ఎన్నిమార్లు ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఫెవికాల్ అధికారులను మాత్రం కదిలించడంలేదు. వారు నిర్వర్తించాల్సిన విధుల కంటే వైసీపీకి ప్రయోజనం కలిగేలా వ్యవహరించి పెద్దిరెడ్డికి కొందరు అధికారులు సొంత మనుషుల్లా మారిపోయారు. ఎన్నికల్లో కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా వైసీపీ కోసం పనిచేసి నేతలతో అంటకాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీతో అంటకాగిన అధికారులకు స్థానచలనం ఉంటుందని అందరూ ఆశగా ఎదురుచూశారు. కానీ ఉద్యోగుల బదిలీలను ఆగస్టు 31వ తేదీలోపు పూర్తి చేయాలని నిర్ణయించగా పింఛన్ల పంపిణీ, భారీ వర్షాల వల్ల ఈనెల 15వ తేది వరకు గడువు పెంచారు. కానీ మళ్లీ బదిలీల గడువును ఈనెల 22వరకు పొడిగిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

మళ్లీ కొనసాగేందుకు ముమ్మర యత్నాలు

పుంగనూరులో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు మళ్లీ ఇక్కడే కొనసాగేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ పాలనలో ఏకపక్షంగా పనిచేసినట్లే మీకు కూడా మద్దతుగా వ్యవహరిస్తామని బదిలీ కాకుండా చూడాలని తెలుగుదేశం, బీజేపీ, జనసేన నేతలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఎలాగైనా పుంగనూరు నియోజకవర్గంలో కొనసాగేలా సహాయం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వద్దకు పలువురు నేతలు ద్వారా సిఫార్సులకు ప్రయత్నిస్తున్నారు. చల్లా బాబు మాత్రం వైసీపీకి అనుకూలంగా ఉన్న వారిని వద్దంటున్నారు. కూటమి పార్టీల్లోని నేతల బంధువులు, బయట ప్రాంతాల్లోని నేతలు, స్థానిక నేతల ద్వారా సిఫార్సులకు ఒత్తిళ్లు తెస్తున్నారు. ప్రధానంగా పుంగనూరు మున్సిపాలిటీ, మెప్మా, మండల పరిషత్, పోలీస్, వ్యవసాయశాఖ, పశుసంవర్థకశాఖ, ఆర్టీసీ, తహసీల్దార్ కార్యాలయం, మార్కెట్ కమిటీ, ఎస్పీడీసీఎల్, దేవదాయశాఖ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితర శాఖల ఉద్యోగులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. వీరిలో చాలామంది పెద్దిరెడ్డికి అనుకూలంగా పనిచేసి, పలు అవినీతి ఆరోపణలతో ఉన్న వారు ఉన్నట్లు తెలిసింది. ఈనెల 15వతేదికి బదిలీల ప్రక్రియ పూర్తి అవుతుందని ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు గడువు పొడిగింపు ఆందోళనకు గురిచేస్తోంది. అవినీతి అక్రమాలు వెలుగులోకి రావాలంటే గతంలో పనిచేసిన ఉద్యోగులంతా బదిలీ కావాల్సిందేనని టీడీపీ శ్రేణులు భావిస్తున్నారు.

ఉపవాసాలతో అక్కదేవతలకు పూజలు



సోమల, సెప్టెంబరు 14: నడింపల్లె పంచాయతీ కరకమందలో శుక్రవారం రాత్రి భక్తులు ఉపవాస దీక్షలతో అక్కదేవతలకు పూజలు జరిపారు. రాత్రి 10గంటలకు కరకమంద ప్రజలు అక్కదేవతలకు పూజా సామగ్రిని, మొక్కుబడులు తీర్చుకునే భక్తులు నూతన అశ్వవాహనాలను ఊరేగింపు అక్కదేవత ఆలయానికి చేరుకున్నారు. అక్కదేవతలను పుష్పాలతో అలంకరణ చేసి అభిషేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చిన్నసోమల బోయకొండమ్మ జాతర



సోమల, సెప్టెంబరు 14: సోమల పంచాయతీ చిన్నసోమల సమీపంలోని బోయకొండ గంగమ్మ జాతర నేపథ్యంలో శనివారం ఆలయాన్ని సుందరంగా అలంకరించి గణపతి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు. ఆదివారం జాతర నిర్వహణకు ఏర్పాటు చేపట్టారు. నిర్వాహకులు కిరణ్, శ్యామల భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామికి పూజలు

సోమల, సెప్టెంబరు 14: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉభయదారులు మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. సోమల, కరకమంద, చెన్నయ్యగారిపల్లె, నడింపల్లె, సూరయ్యగారిపల్లె తదితర గ్రామాల భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం



కల్లూరు, సెప్టెంబర్ 14: పులిచెర్లలో శనివారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సీఐ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రాష్ట్ర పభుత్వం తాజాగా రద్దు చేసి ఎక్సైజ్‌శాఖలోకి విలీనం చేసిందన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ చైతన్య, సిబ్బంది సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

17న ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

రొంపిచెర్ల, సెప్టెంబరు14: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఈనెల 17వ తేదిన రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీలు ఈనెల 3వ తేది నుంచి 16 వరకు నిర్వహిస్తున్నారన్నారు. 17తేది 10గంటలకు బహిరంగసభ జరుగుతుందని తెలిపారు.

కల్లూరు ఎస్ఐగా వెంకటేశ్వర్లు



కల్లూరు, సెప్టెంబర్ 14: పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ మద్యం, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె, సెప్టెంబర్14: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానిక గోసలకురప్పల్లెలో గంగాధర్, అతడి భార్య లావణ్య(22) కూలి పనులు చేసుకుంటూ జీవించేవారు. భర్త గంగాధర్‌తో ఆమె కూలి పనుల విషయంపై గొడవ పడ్డారు. ఈక్రమంలో లావణ్య మనస్థాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు కల్పించి మెరుగైన చికిత్సల కోసం పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏచూరికి ఘన నివాళి

చౌడేపల్లె, సెప్టెంబర్14: సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరికి జిల్లా ప్రధాన కార్యదర్శి వాడా గంగరాజు ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ క్లినిక్‌లో సీపీఎం శాఖ మహాసభలు నిర్వహించి, నూతన కార్యదర్శిగా చంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ..బోయకొండ రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గిరిధర్‌గుప్త, రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలంలోకి పశువులు వెళ్లాయని దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు14: వరిపొలంలోకి పశువులు వెళ్లాయని తమపై దాడి చేశారని బాధితుడు నాగరాజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీ అలసాపురానికి చెందిన రెడ్డెప్ప కుమారుడు నాగరాజు పశువులు మేపుతుండగా వరిపొలంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన రామయ్య, ఆదెమ్మ, శ్రీదేవిలు కలసి నాగరాజపై దాడి చేస్తున్నట్లు తెలుసుకున్న ఆయన భార్య సుమంగళి అడ్డువెళ్లడంతో ఇద్దరిని గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఏఎస్ఐ దామోదరం ఇరువర్గాలను పిలిపించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై మోదీ చారిత్రాత్మక నిర్ణయం

బీజేపీ నేత ఆయూబ్‌ఖాన్

పుంగనూరు, సెప్టెంబరు 14: ఆయుష్మాన్ భారత్ జన ఆరోగ్యయోజన విస్తరణపై దేశ ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చానాయకుడు పి.అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి వర్గం రూ.3,437 కోట్లతో వృద్ధులకు వైద్యం అందించడానికి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. దేశంలోని 6 కోట్ల సీనియర్ సిటిజన్లకు రూ. 5లక్షల వరకు ఉచితంగా వైద్యం అందుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షల విరాళం



గంగవరం, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితులకు అండగా మేము సైతం అంటూ పలమనేరు మదర్‌థెరీసా విద్యాసంస్థల చైర్మన్ ఎం.ఆర్. సునీల్ రూ.10 లక్షల డీడీని మంత్రి నారా లోకేష్‌కు అందించారు. విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం ఇలా అందరూ తమకు తోచిన సహాయం చేసి, రూ.10 లక్షల డీడీ తీసి అమరావతిలో నారాలోకేష్‌కు అందించారు.

కుప్పం వైద్యుల సాయం రూ.7.64 లక్షలు



కుప్పం, సెప్టెంబరు 14: విజయవాడ వరదల్లో నష్టపోయిన బాధితులకు కుప్పం వైద్యులందరూ కలిసి రూ.7.64 లక్షలు విరాళంగా ఇచ్చారు. మెడికల్ అసోసియేషన్ తరపున డాక్టర్ సురేశ్‌బాబు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ శివ ప్రకాశ్‌తోపాటు పలువురు వైద్యులు ఈ మొత్తం చెక్కును శనివారం ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ సలహాదారు నరేశ్ ఆచారిలకు అందించారు. ఈ విరాళంలో 750 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాల కిట్లను అందించనున్నట్లు మనోహర్ తెలిపారు.

వరద బాధితులకు టీడీపీ నేత బాసట



శాంతిపురం, సెప్టెంబర్ 14 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు తనవంతు సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. మండల పార్టీ కార్యాలయంలో యూనిట్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ డబ్బులను సీఎం రిలీఫ్ ఫండుకు అందించాలని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పివి నాగరాజుకు అందించారు. అలాగే నడింపల్లె గ్రామానికి చెందిన మండల వన్నికుల సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, గొల్లపల్లె జయప్పలు కలిపి కుప్పం పార్టీ కార్యాలయంలో రూ.12000 సహాయం అందించారు.

గుడుపల్లె టీడీపీ నేత రూ.లక్ష విరాళం

గుడుపల్లె, సెప్టెంబరు14: గుడుపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు బాబు విజయవాడ వరద బాధితుల కోసం రూ.లక్ష విరాళం అందిస్తున్నటు ప్రకటించారు. పార్టీ నాయకులతో కలిసి సీఎం చంద్రబాబుకు ఆ మొత్తం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాల విడుదల

గుడుపల్లె, సెప్టెంబరు 14: ద్రావిడ విశ్వవిద్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలకు సంబంధించిన రూ. 2.86 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గత సంవత్సర కాలంగా జీతాలు అందక వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సాధారణ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబును ద్రావిడ వర్సిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి వారి సమస్యను విన్నవించారు. చంద్రబాబు స్పందించి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు జీతాల అందజేస్తామని చెప్పారు. ఈ మేరకు వారికి జీతాలకు సంబంధించిన నిధులు విడుదల అయ్యాయి. జీతాలు రావడంతో ఉద్యోగులు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం వారు వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్‌లను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

రెస్కో మాజీ చైర్మన్ సెంథిల్‌కు 14 రోజుల రిమాండ్

కుప్పం, సెప్టెంబరు 14: కుప్పం రెస్కో మాజీ చైర్మన్ జీఎస్.సెంథిల్ కుమార్‌కు కుప్పం కోర్టులో మరోసారి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువడింది. రెస్కో ఎండీ వాహన నిర్వహణకు సంబంధించి నిధుల దుర్వినియోగం కేసులో ఆయనను ఈనెల 2వ తేదీన కుప్పం అర్బన్ పోలీసులు అరెస్టు చేయగా, కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. అయితే అదే కోర్టు తీర్పు ద్వారా మదనపల్లె సబ్ జైలులో ఉన్న సెంథిల్‌ను పోలీసులు రెండు రోజులు కస్టడీలోకి తీసుకుని గడువు ముగియడంతో తిరిగి కోర్టు ముందు హాజరు పరి చారు. కోర్టు తిరిగి 14 రోజుల రిమాండ్ విధించడంతో మదనపల్లె సబ్ జైలుకు సెంథిల్‌ను తరలించారు.

కందూరులో మహాభారత యజ్ఞం

సోమల, సెప్టెంబరు 14: మండలంలోని కందూరులో ఈనెల 16 నుంచి మహాభారత యజ్ఞ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ధర్మకర్త మాజీ ఎంపీటీసీ పి.శ్రీనివాసులు తెలిపారు. పగలు గీతాశ్రీ భాగవతారణిచే హరికథ, 18వ తేదీ నుంచి రాత్రి చిన్నయ్యనాయుడు, రవి ఆధ్వర్యంలో వెంకటేశ్వర నాట్యమండలిచే నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

కంటి చికిత్స శిబిరం విజయవంతం

కుప్పం, సెప్టెంబరు 14: కుప్పం లయన్స్ క్లబ్, పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 100మందికి పైగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, చికిత్సలందించారు. 25మంది రోగులను శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ డా.మహేష్, క్లబ్ సభ్యులు సెల్వం, సెంథిల్‌కుమార్, చరణ్, డా.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



కుప్పం, పలమనేరు, పుంగనూరులలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి, నాయవాదులు

కుప్పం, సెప్టెంబరు 14: లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా షేక్ కోరారు. కుప్పం కోర్టు ఆవరణలో జడ్జి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 19 సివిల్ కేసులకు సంబంధించి రూ.27,86,674 విలువగల వివాదాలు పరిష్కారమయ్యాయి. అలాగే 105 క్రిమినల్ కేసుల్లో రూ.47,34,496 నగదుతో కక్షిదారుల మధ్య రాజీ కుదిరింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరులో 143 కేసుల పరిష్కారం

పలమనేరు : పలమనేరులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు తెలిపారు. జడ్జీలు శ్రీనివాసరావు, లిఖిత, రాధమ్మ మాట్లాడుతూ భార్యభర్తల గొడవల కేసులు, సివిల్ దావా కేసులతోపాటు ఇతర కేసులుకూడా లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించామన్నారు. ఇందులో ఇరుపార్టీల కక్షదారులు గెలుపొందినట్లే అన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్‌లో 143 కేసులకు సంబంధించి రూ. 97,07,949లు కక్షదారుల ద్వారా పరిష్కరించామన్నారు. ఇందులో సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి, పరమశివప్ప, భాస్కర్, ఏపీపీ రంజిత్‌షా, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, కక్షదారులు పాల్గొన్నారు.

పుంగనూరులో 63 కేసుల పరిష్కారం

పుంగనూరు : లోక్‌అదాలత్‌లో 63 కేసులు పరిష్కరించినట్లు పుంగనూరు కోర్టు న్యాయమూర్తి శిరీష్ తెలిపారు. శనివారం పుంగనూరు కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 6 సివిల్, 57 క్రిమినల్ కేసులు పరిష్కరించి ఇందులో కక్షిదారులకు రూ.21,50 లక్షలు ఇప్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి ఉమాదేవి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవాదులు, కక్షదారులు తదితరులు పాల్గొన్నారు.

బేలుపల్లెలో ప్రబలిన అతిసార : వైద్యశిబిరం ఏర్పాటు



బేలుపల్లెలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 14 : మండలంలోని బేలుపల్లెలో రెండు రోజులుగా అతిసార ప్రబలడంతో దాదాపు 15మంది అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. పాతరక్షిత బోరు వద్ద పైపులైన్ లీకేజీ కారణంగా ఆ నీటిని వినియోగించిన పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అతిసారతో తీవ్ర అస్వస్థతకు లోనైన రమణ తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆదిలక్ష్మి కుప్పం పీఈఎస్ ఆస్పత్రి, మునెమ్మ చిత్తూరు ప్రభుత్వాసుపత్రి, రత్నమ్మ, రామచంద్ర పలమనేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంకా గ్రామంలో దాదాపు పదిమంది స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా బేలుపల్లెలో అతిసార ప్రబలిన విషయం తెలిసి శనివారం ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లోకనాథం, గ్రామకార్యదర్శి బాలాజీ గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పైపులైన్ లీకేజీలను అరికట్టడానికి తగిన చర్యలు చేపట్టారు. అలాగే బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది బేలుపల్లెలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి పలువురికి మందులు పంపిణీ చేశారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆరోగ్యసంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

పాతపేటలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కల్లూరు, సెప్టెంబర్ 14: పులిచెర్ల మండలం పాతపేటలో శనివారం ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. పాతపేటలో నెలకొన్న తాగునీటి సమస్యపై శనివారం తాగునీటి సమస్యను పరిష్కరించండి శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పాతపేటకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని, మోటారుకు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మరమ్మతులకు గురైన మోటారును త్వరలో రిపేరు చేసి అమర్చుతామని, అంతవరకు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని పంచాయతీ కార్యదర్శి చిరంజీవి తెలిపారు.



కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఓనం నృత్యం ఆడుతున్న విద్యార్థినులు

కేఈసీలో ఓనం పండుగ

కుప్పం, సెప్టెంబరు 14: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు సంప్రదాయ కేరళ దుస్తులను ధరించి ఓనం నృత్యాలు చేశారు. కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను చిహ్నంగా తరతరాలుగా ఓనం పండుగను కేరళ వాసులు ఏటా 10రోజుల పాటూ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కేరళ సంప్రదాయ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విమలజోసెఫ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి 'గాడిచర్ల' విశేష సేవలు



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

గంగవరం, సెప్టెంబరు14: గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీకారుడిగా తెలుగు జాతికి విశేష సేవలందించారని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక కళామందిరంలో గ్రంథాలయ ఉద్యమ పితామహులు హరిసర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం వచ్చిన తరువాత పుస్తకాలను చదవడం చాలావరకు తగ్గిపోయిందన్నారు. సెల్‌ఫోన్ వినియోగంతో మంచి ఎంతమేరకు ఉంటుందో, చెడు కూడా అంతకు రెండింతలు హెచ్చుగా ఉంటుందనడంలో సందేహం లేదన్నారు. అందుకే ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లలను బాల్యం నుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు ఆనందబాబు, గుణశేఖర్, దేవనాథరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు14: పుంగనూరు - మదనపల్లె మార్గంలో ద్విచక్రవాహనాన్ని శనివారం స్కూల్ బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నెకు చెందిన అమరనాథ్ కుమారుడు టి. నవీన్‌కుమార్(17) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పట్టణంలోని విశ్వభారతి స్కూల్ బస్సు వెనుకవైపు నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి గాయపడిన నవీన్ కుమార్‌ను చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు సూచించడంతో కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు తెలిపారు.

వరద బాధితులకు నిత్యవసరాల కిట్ల పంపిణీ



కుప్పం, సెప్టెంబరు 14: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కుప్పం నాయకులు విజయవాడలోని 30వ డివిజన్‌లో శనివారం వరద బాధితులకు నిత్యవసరాలు ఎమ్మెల్యే బోండా ఉమాతో కలిసి పంపిణీ చేసారు. కుప్పం టీడీపీ ఇన్‌చార్జి మునిరత్నం, నాయకులు సత్యేంద్రశేఖర్, వెంకటేష్, సోము తదితరులు పాల్గొన్నారు.

గెస్తింపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణం



వి.కోట, సెప్టెంబరు 14: గ్రామీణ ప్రాంతాలకు సీసీ రోడ్లతో మహర్దశ పట్టనుం దని మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. శనివారం కుంభార్లపల్లె పంచాయతీ గెస్తింపల్లెలో ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్ళే రోడ్డుకు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. రంగనాథ్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గెస్తింపల్లెలో రూ.12లక్షల వ్యయంతో నూతన రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏఈ శ్రీనివాస్‌కు సూచిం చారు. స్థానిక నేతలు విశ్వనాథ్‌గౌడు, దేవరాజ్, బాబు, రమేష్, వాసు ఉన్నారు.

తాగునీటి బోరు లీకేజీ



వి.కోట, సెప్టెంబరు 14: వి.కోట పంచాయతీ భారత్‌నగర్‌లో తాగునీటి బోరు నుంచి నీరు లీకవుతోంది. మోటారు ఆన్ చేయగానే బోరు నుంచి ట్యాంకుకు వెళ్ళే పైపు కింది భాగంలో పగలడంతో నీరు రోడ్డుపైకి వస్తోంది. నీటి లీకేజీతో భారత్‌నగర్‌కు వెళ్ళే ప్రధాన రహదారిపై నీరు నిలిచి బురదకుంటను తలపిస్తోంది. బోరు వద్ద లీకేజి అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం



పుంగనూరు, సెప్టెంబరు14: పుంగనూరులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. శనివారం స్థానిక బెస్తవీధిలోని వినాయక విగ్రహం వద్ద యువత నృత్యాలు, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్నదానాలు చేశారు. అలాగే పుంగనూరులో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తున్నారు.

మాలలపై దురుసు ప్రవర్తన తగదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు14: నెల్లూరు జిల్లా సర్వేపల్లె నియోజకవర్గం ముత్తుకూరులో మాలలపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఒక వర్గం వద్ద మాత్రమే ఫిర్యాదు తీసుకుని దళిత వర్గాల వద్ద ఫిర్యాదు తీసుకోకుండా వారిని రాత్రి పోలీసు స్టేషన్‌లో పెట్టుకుని చిత్రహింసలు పెట్టిన ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి, కానిస్టేబుల్ సుమన్‌ను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు14: నిద్రమాత్రలు మింగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం పుంగనూరులో జరిగింది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మంజేగౌడ కుమారుడు సునీల్(30) శనివారం నిద్ర మాత్రలు మింగి ఇంటిలో స్పృహ కోల్పోయిపడివుండటం చూసిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించిందని డాక్టర్లు సూచించడంతో మదనపల్లెకి తరలించినట్లు తెలిసింది. కారణాలు తెలియాల్సివుంది.

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు


జస్టిస్ మన్మథరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ కిరణ్మయి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి.. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విష్ణు, రవి తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడికి కలశ పూజ

వెదురుకుప్పం, సెప్టెంబరు 14: కార్వేటినగరంలోని శివాలయం వీధిలో కొలువై ఉన్న వినాయకుడికి శనివారం కలశపూజ నిర్వహించారు. చవితి సంబరాల్లో భాగంగా అభిషేకాలు, అర్చనలు, అన్నదానం చేశారు.

పాలసముద్రం: మహదేవపురంలో ఉన్న శ్రీకృష్ణ భజన మందిరం ఆవరణలో శనివారం గ్రామస్తులు వినాయక స్వామి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

వేడుకగా ఉట్లోత్సవం



పెనుమూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సీఎస్ అగ్రహారంలో వినాయకుడి ప్రతిమ ఊరేగింపు సందడిగా సాగింది. ఈ సందర్భంగా యువత ఉట్లోత్సవం వేడుకగా నిర్వహించారు. అనంతరం గణేశుడి పంచె, టవల్‌తోపాటు లడ్డూను వేలంపాటలో వెంకటేశ్ రూ.5400కి దక్కించుకున్నాడు. గ్రామస్తులు పాండు, దీనుప్రకాష్, మునిరాజు, వేణు, మురుగన్, రాహుల్, బాలు, లక్ష్మీపతి, రూపకుమార్, కన్నెప్ప, వినోద్, సోమశేఖర్‌తో పాటు యువకులు పాల్గొన్నారు.

ఇద్దరికి వీల్ చైర్ల వితరణ



వెదురుకుప్పం, సెప్టెంబరు 14: కార్వేటినగరం మండలం విజయమాంబాపురంలో ఇద్దరికి వీల్‌చైర్లు వితరణ చేశామని జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ శనివారం తెలిపారు. ఆ గ్రామంలో గౌతం(12), చంద్రయ్య(47) నడవలేని స్థితిలో ఉండటంతో గుర్తించి జనసేన తరఫున అందజేశామని చెప్పారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 14: దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండోమెంట్ ఏసీ ప్రసన్నలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3 నుంచి 13వ తేదీవరకు జరిగే ఈ ఉత్సవాలకు గిరింపేట దుర్గాంబ, శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక, చాముండేశ్వరిదేవి, బజారువీధి కన్యకా పరమేశ్వరి, కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వర, కాశీవిశ్వనాథ వరదరాజ, కోదండరామ, మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర, కట్టమంచి వరదరాజ, పొన్నయమ్మ, వీరాంజనేయ, రంగాచారివీధి ప్రసన్న వెంకటేశ్వర, సంతపేట విజయలక్ష్మికాలనీ శ్రీరంగనాథ, కట్టమంచి షిరిడీ సాయి ఆలయాల్లో నిర్వాహకులు, ఈవోలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 14: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బెంగళూరు వైదేహీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైదేహీ హాస్పిటల్ మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ నానబాల లోకేష్ తెలిపారు. శిబిరంలో ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్టింగ్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఏకాదశి పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 14: కార్వేటినగరం స్కంధపుష్కరిణి సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా గ్రామ దేవతల ఊరేగింపు


పిల్లయార్‌గుడి పొన్నియమ్మన్ - పొన్నియమ్మన్

నగరి, సెప్టెంబరు 14: నగరి మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో గ్రామ దేవతలైన పొన్నియమ్మన్, పిళ్లయార్‌గుడి పొన్నియమ్మన్ దేవతలను శనివారం సాయంత్రం వైభవంగా ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయలు సమర్పించి, మంగళహారతులు పట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్రైస్తవ కూటములు ప్రారంభం

గుడిపాల, సెప్టెంబరు 14: సీఎస్ఐ ఈస్టర్ కొండపై శనివారం క్రైస్తవ కూటములు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సీఎస్ఐ వేలూరు డయాసిస్ బిషప్ డాక్టర్ శర్మ నిత్యానందం పాల్గొని సందేశాలిచ్చారు. ఆదివారం కూడా ఈ కూటములు జరుగుతాయని నిర్వాహకులు అన్బురాజ్ రూబన్ పీటర్ తెలిపారు.

నగరపాలక కార్యాలయంలో నూతన కమిషనర్


ఫైల్‌పై సంతకం చేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు, సెప్టెంబరు 14: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన నరసింహ ప్రసాద్ శనివారం కార్యాలయానికి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పుంగనూరు కమిషనర్‌గా ఉన్న ఆయన చిత్తూరుకు నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఈనెల 4వ తేదీ కమిషనర్‌గా చార్జ్ తీసుకున్న ఆయన నేరుగా విజయవాడ వరదల సహాయ చర్యల విధుల్లో చేరారు. అక్కడ విధులు ముగియడంతో శనివారం నగరపాలక కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు ఆదామ్, గోవర్ధన్, యాడీఆర్ఐ అమర్నాథ్‌రెడ్డి, ఇతర ఉద్యోగులు స్వాగతం పలికారు.

ఎండుతున్న వేరుశనగ పంట



పాలసముద్రం, సెప్టెంబరు 14: వర్షాభావంతో వేరుశనగ పంట ఎండు ముఖం పట్టింది. నెల రోజులుగా మండలంలో వర్షం కురవక పోవడంతో తిరుమల రాజుపురం, గంగమాంబపురం, నర్సింహాపురం, కోదండరామాపురం, బాలకృష్ణాపురం, వనదుర్గాపురం, సింహరాజపురం పంచాయతీల్లో సుమారు 500 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. వర్షం సరిగా కురవక పోవడంతో పంట దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. పిందెలు, కాయ దశలో ఉన్న పంటను కోల్పోతే పెట్టుబడి ఖర్చులు కూడా రావంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలోనే అడవి పంది మృతి

వెదురుకుప్పం, సెప్టెంబరు 14: రోడ్డు ప్రమాదంలోనే అడవి పంది మృతి చెందినట్లు గుర్తించామని కార్వేటినగరం పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్ శనివారం రాత్రి తెలిపారు. కార్వేటినగరం ఫారెస్టు అధికారుల రిక్విజేషన్ ప్రకారం కుప్పానిగుంటకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో చనిపోయి పూడ్చిన ఓ పందికి శనివారం మధ్యాహ్నం పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఆ పంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం వల్ల గాయాలయ్యాయని చెప్పారు.


రథోత్సవం ముగిశాక ఉత్సవర్లను ఆలయంలోకి మోసుకొస్తున్న ఎమ్మెల్యే, ఈవో తదితరులు


మహా మండపంలో.. ధ్వజస్తంభానికి.. సుపథ మండపంలో ఆకట్టుకుంటున్న అలంకరణలు

కాణిపాకంలో ఆకట్టుకున్న అలంకరణలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14: వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన పుష్పాలంకరణలు, వివిధరకాల దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహా మండపం, సుపథ మండపం, ధ్వజస్తంభానికి చేసిన పుష్పాలంకరణ, చాక్లెట్, బిస్కెట్ గణపతి అలరించాయి. వీటితోపాటు రథోత్సవ నిర్వహణ సమయంలో ఆలయ సిబ్బంది వేషధారణలు, కీలుగుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


దుర్యోధనుడు, నరసింహస్వామి వేషధారణలో ఆలయ సిబ్బంది


రథోత్సవం ముందు కీలు గుర్రాలు, లంబాడి నృత్యాలు- కొబ్బరి కాయలు కొట్టి, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


ఆస్థాన మండపంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు - ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఉభయదారులు

మేం కదలం..!

ఆ ముగ్గురు ఉద్యోగుల వైఖరితో తలలు పట్టుకుంటున్న టీడీపీ నాయకులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 14: గంగాధరనెల్లూరు మండలానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ పురుష ఏపీఎం, ముగ్గురు పురుష సీసీలు, ఇద్దరు మహిళా సీసీలు ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చారు. వీరిలో ఏపీఎం తమకొద్దని అప్పట్లో వైసీపీ నేతలు కొందరు మాజీ డిప్యూటీ సీఎంపై ఒత్తిడి చేసి మరీ యాదమరికి బదిలీ చేయించారు. అయితే మాజీ డిప్యూటీ సీఎంపై ఎస్ఆర్‌పురం మండల నేతలతో ఒత్తిడి చేయించి మరీ తిరిగి గంగాధరనెల్లూరులోనే విధుల్లో చేరిన విషయం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇక వింజం, బాలగంగనపల్లె పంచాయతీలకు సంబంధించి ఓ పురుష సీసీ తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారంటూ డ్వాక్రా సంఘాల్లోని మహిళలు తమ కుటుంబీకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇలాంటి సీసీని బదిలీ చేయాలంటూ ఇప్పటికే జిల్లా అధికారులకు ఆ పంచాయతీల్లోని కొందరు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరో పురుష సీసీ తాను ఇక్కడే ఉంటానని ఓ నేతను కలిసి గట్టిగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఓ మహిళా సీసీ పెనుమూరు మండలానికి బదిలీపై వెళ్లగా, మరో మహిళా సీసీని ఆయా పంచాయతీలకు చెందిన టీడీపీ నేతలు, సంఘమిత్రల ఫిర్యాదులతో బదిలీ అయ్యేవరకు జిల్లా కేంద్రంలోనే ఉండాలని అధికారులు మౌఖికంగా ఆదేశించారు. ఇవన్నీ ఇలా ఉంటే.. ఏపీఎంతోపాటు ఇద్దరు పురుష సీసీలను బదిలీ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వద్ద చర్చించి జిల్లా అధికారులకు లెటర్లు సైతం టీడీపీ నేతలు అందించారని తెలిసింది. అయినా ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ ముగ్గురు ఉద్యోగుల వైఖరితో టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. పైగా మేం కదిలేది లేదంటూ తమ ఎదుటే ఉద్యోగులు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని, తమకెందుకీ పదవులు అంటూ బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనికలమ్మ దేవతలకు పూజలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 14: వీరకనెల్లూరు పంచాయతీ అక్కదేవతల కండ్రిగ గ్రామంలో కనికలమ్మ దేవతలకు గ్రామస్తులు శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ పూజలు జరిపించడం ఆనవాయితీ. మట్టితో తయారుచేసిన ఏనుగులు, గుర్రాల బొమ్మలను పురుషులు తమ తలలపై పెట్టుకుని పంబలవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా రాగా, మహిళలు పొంగళ్లను తీసుకొచ్చి సమర్పించారు. బెంగళూరులో ఉంటున్న గ్రామస్తులు సైతం ఈ పూజల కోసం తరలివచ్చారు. అందరికీ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు.


పొంగళ్లు పెడుతున్న మహిళలు - ఏనుగులు, గుర్రాల బొమ్మలతో పురుషులు - కనికలమ్మదేవత విగ్రహాలకు విశేష అలంకరణ

ఇసుక లారీ పట్టివేత


పోలీస్‌స్టేషన్ పక్కన గుడి వద్ద ఇసుక లారీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 14: మండలం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని గంగాధరనెల్లూరు పోలీసులు పట్టుకున్నారు. నీవానది ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ ఇసుక లారీని మైన్స్ అధికారులకు స్వాధీనం చేసినట్లు తెలియవచ్చింది. ఈ కేసు వివరాల కోసం పోలీసులను సంప్రదించగా, ఇన్‌చార్జి సీఐ లక్ష్మన్న కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం బందోబస్తు కార్యక్రమానికి వెళ్లారని, ఆయనొచ్చాక కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇసుకలారీని పోలీస్‌స్టేషన్‌కు పక్కన గుడి వద్దకు తీసుకొచ్చి పెట్టారు. ఇదిలా ఉంటే.. శుక్రవారం రాత్రి మండలంలోని తూగుండ్రంకు సమీపంలో ఇసుకలారీని పట్టుకోగా, శనివారం రాత్రికి కూడా ఇసుక లారీకి సంబంధించి వివరాలను పోలీసులు చెప్పక పోవడం గమనార్హం.

అక్రమ వ్యాపారాన్ని సహించం: ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, సెప్టెంబరు 14: అక్రమ వ్యాపారం చేస్తే సహించం.. ఏస్థాయి నాయకుడైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ శనివారం తెలిపారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం వద్ద శుక్రవారం రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు భారీ లారీని తనిఖీ చేయడంతో 50 టన్నుల ఇసుక రవాణా బండారం బయట పడిందన్నారు. ఈ ఇసుకను గంగాధరనెల్లూరు మండలంలోని వేణుగోపాలపురంకు చెందిన ఓ టీడీపీ నాయకుడిదిగా పోలీసులు గుర్తించారన్నారు. ఈ వాహనాన్ని అడ్డుకోవడంతో ఆ టీడీపీ నాయకుడు పోలీసులపై నానా హంగామా చేశాడని తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో అక్రమ వ్యాపారం చేసే ఏ నాయకుడినీ వదిలిపెట్టొద్దని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. అక్రమాలను కూటమి ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. సుమారు 25లక్షల విలువ చేసే ఇసుకను పోలీసులు పట్టుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో నియోజకవర్గానికి సంబంధించి ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడినట్లు ఎమ్మెల్యే చెప్పారు, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

త్వరలో డిగ్రీ కళాశాలకు భూమి పూజ

వెదురుకుప్పం, సెప్టెంబరు 14:వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి త్వరలో ఎమ్మెల్యే థామస్ భూమి పూజ కార్యక్రమం చేస్తారని జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ శనివారం తెలిపారు.

ఆరుగురిపై హత్యాయత్నం కేసు

చిత్తూరు, సెప్టెంబరు 14: ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి మరో వాహనంతో ఢీకొన్న ఘటనలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం దాడులకు దారి తీసింది. ఇదికాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రెండో పట్టణ పోలీసులు నిందితులు ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. సంతపేటకు చెందిన అరుణ్.. సంతపేట లిల్లీబ్రిడ్జిపై ద్విచక్ర వాహనంలో శుక్రవారం 11 గంటల సమయంలో వెళుతున్నాడు. అతనికన్నా ముందు వసంత్ అనే వ్యక్తి మరో ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. ఈ క్రమంలో వసంత్ వాహనాన్ని అరుణ్ ఢీకొనడంతో ఇద్దరూ ఘర్షణపడ్డారు. ఇంతలో ఈ విషయాన్ని అరుణ్ తన కుమారుడికి చేరవేశాడు. దీంతో మరో ఐదుగురు సంఘటనా స్థలానికొచ్చి వసంత్‌పై రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వసంత్ తలకు బలమైన గాయంకావడంతో 25 కుట్లు పడ్డాయి. రెండు పళ్లు ఊడిపోయాయి. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీరియస్ అయిన సీఐ.. దాడికి పాల్పడిన ఆరుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో అల్లరిమూకలు అరాచకాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాత్రిపూట మద్యం తాగి రోడ్డుపై వెళ్లేవారిని బెదిరించడం, మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడటం, ఈవ్ టీజింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.


విజయం సీబీఎస్ఈ స్కూల్లో.. బృందావన్ పాఠశాలలో..

పాఠశాలల్లో హిందీ దివస్ వేడుకలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 14: జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చిత్తూరు నగరంలోని పలు పాఠశాలల్లో హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. విజయం సీబీఎస్ఈ పాఠశాలలో అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ముఖ్య అతిథిగా హాజరై హిందీ ప్రాముఖ్యాన్ని వివరించారు. హెచ్ఎం కౌసల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- బృందావన్ పాఠశాలలో అధినేత్రి శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు హిందీ కవుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 14: సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు ఎక్సైజ్ అధికారులు క్షీరాభిషేకం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చిత్తూరు రూరల్ స్టేషన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ను రద్దు చేయడంపై ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు, ఏఈఎస్ రవి, అర్బన్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, రూరల్ ఎక్సైజ్ సీఐ హరికృష్ణ, డీటీఎఫ్ సీఐ శేషాచలం, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: సీఎం, ఎక్సైజ్ మంత్రి చిత్రపటాలకు కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీదుర్గయ్య, సిబ్బంది క్షీరాభిషేకం చేశారు. ఎస్ఈబీని రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ ప్రదానం


సుబ్రహ్మణ్యం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 14: హర్యానా రాష్ట్రానికి చెందిన ఎంబీఆర్ యూనివర్సిటీ 2024 సంవత్సరానికి ప్రతిభగల విశిష్ట వ్యక్తులకు డిల్లీలో శనివారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 29 మందికి డాక్టరేట్ ప్రదానం చేయగా, ఇందులో చిత్తూరుకు చెందిన వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్ ఎస్.సుబ్రహ్మణ్యం (నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు) ఉన్నారు. ఈయనకు సోషల్ సర్వీస్ అండ్ ట్రేడ్ యూనియన్ లీడర్‌షిప్ విభాగంలో డాక్టరేట్‌ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్‌కే బాటియా ప్రదానం చేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 14: లిటిల్ రోజ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆదివారం గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌లో రూ.49.61 లక్షల సెటిల్‌మెంట్


కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

నగరి, సెప్టెంబరు 14: నగరి పట్టణ పరిధిలోని జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో 165 కేసులను పరిష్కరించి, రూ.49.61 లక్షలు సెటిల్‌మెంట్ చేసినట్లు న్యాయమూర్తి గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పలు సివిల్, బ్యాంకు కేసులు, ఎన్ఐయాక్టు, ఐపీసీ,పీఎల్‌సీ, ఎస్టీసీ కేసులు విచారణకు వచ్చాయన్నారు. ఏపీపీ రామశాంతి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు జగదీష్, న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బస్టాప్ వద్ద ముళ్ల కంపల తొలగింపు

పెడకంటిపల్లె దళితవాడవాసుల చొరవపై స్థానికుల హర్షం


బొమ్మవారిపల్లె బస్టాప్ వద్ద తొలగిన ముళ్లకంపలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 14: బొమ్మవారిపల్లె బస్టాప్ వద్ద ఏపుగా ముళ్లకంపలు పెరిగిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పైగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ సమస్యను సన్‌షైన్ పేరుతో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసుకుని రూఫింగ్ ఐరన్‌షీట్ల తయారీ చేసే పాపిరెడ్డిపల్లె పంచాయతీ పెడకంటిపల్లె దళితవాడకు చెందిన చంద్రమోహన్, డేవిడ్ గుర్తించారు. దీంతో వీరిద్దరూ చొరవచూపి.. ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్లకంపలను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శుభ్ దిన్ భోజనంకు స్పందన


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 14: కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుభ్ దిన్ భోజనం ఏర్పాటుకు దాతల నుంచి స్పందన లభిస్తోంది. ఇదే పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు కె.హరిత తన కుమారుడు పునీత్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 11వ తేదీన 155 మంది విద్యార్థులకు కేసరి, వడతో పాటు మధ్యాహ్న భోజనం ఒకరోజు విద్యార్థులకు అందించారు. ఇది తనకు భగవంతుడు కల్పించిన వరంగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, యువత, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నట్లు హెచ్ఎం కేశవులు తెలిపారు.